

నాట్య మయూరం





మండే ఎండల నుంచి చిరుజల్లులు ఉపశమనాన్నిస్తున్నాయి. అడపాదడప కురుస్తున్న వర్షాలకు మనుషులతో పాటు పశుపక్ష్యాదులు సైతం ఊరట చెందుతున్నాయి. కంది మండలం ఎద్దుమైలారం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం ఆకాశాన్ని మబ్బులు కమ్మేసిన వేళ ఓ నెమిలి ఇలా పురివిప్పి నాట్యం చేసింది.

-సంగారెడ్డి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

ఇంటర్‌లో
సగం మందే పాస్

అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, జూన్ 24 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో దాదాపు సగం మంది విద్యార్థులే పాసయ్యారు. ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో ఫస్టియర్ జనరల్ విభాగంలో 9,358 మంది పరీక్షకు హాజరుకాగా 5,456 మంది (58.3 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 600 మంది పరీక్షరాయగా, 331 మంది (55.17 శాతం) పాసయ్యారు. సెకండియర్ జనరల్ విభాగంలో 5,213 మంది పరీక్ష రాయగా 2,277 మంది (43.68 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 391 మంది పరీక్షకు హాజరుకాగా, 190 మంది (48.59 శాతం) పాసయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

మెదక్ జిల్లాలో...


ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో మెదక్ జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 52.65 శాతం, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 51.28 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్ విభాగంలో మొత్తం 3,518 మంది పరీక్షలకు హాజరుకాగా 1,804 మంది (51.28శాతం) పాసయ్యారు. ద్వితీయ సంవత్సర జనరల్ విభాగంలో మొత్తం 2,186 మంది పరీక్షలు రాయగా 1,151 మంది (52.65 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 994 మంది బాలికల్లో 551 మంది (55.43 శాతం), 1,192 మంది బాలురలో 600 మంది (50.34శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ఫస్టియర్ 154 మందికి 105 మంది (68.18శాతం), సెకండియర్ 134 మందికి 80 మంది (59.7శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

834 మంది
స్కూల్ అసిస్టెంట్ల బదిలీ

వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశాలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 24 : ఉపాధ్యాయ బదిలీ పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. స్థానిక సంస్థల యాజమాన్యం కింద ఉన్న 834 మంది స్కూల్ అసిస్టెంట్, తత్సమాన క్యాడర్ టీచర్లు బదిలీ అయ్యారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ ముగిసింది. బదిలీ అయిన వారిలో పీఎస్‌హెచ్‌ఎంలు 48 మంది, స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్) 117 మంది, గణితం 152 మంది, తెలుగు 82 మంది, ఉర్దూ ముగ్గురు, బయోసైన్స్ 97 మంది, హిందీ 62 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ 14 మంది, ఫిజికల్ సైన్స్ 149 మంది, సోషల్ స్టడీస్ 110 మంది ఉన్నారు. బదిలీ అయినవారు వెంటనే కొత్త స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఇంకా జడ్పీ యాజమాన్య పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ ప్రారంభం కానున్నది. లోకల్‌బాడీ యాజమాన్యం కింద ఉన్న ఎస్జీటీలకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

కాషాయమా?
కాంగ్రెస్సా?



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పార్టీల నజర్

తొలి టార్గెట్ పటాన్‌చెరు ఎమ్మెల్యే

మైనింగ్, ఈడీ దాడులతో ఉక్కిరిబిక్కిరి

ఎటూ తెల్చుకోలేక సతమతం

ఆలోచనలో మహిపాల్‌రెడ్డితోపాటు పలువురు శాసనసభ్యులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 24: పదేళ్లుగా తిరుగులేని పెత్తనం చెలాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి దిక్కుతోచకున్నది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ వేగవంతం చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలాగైనా పార్టీలో చేర్చుకోవాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నది. అన్నివైపుల నుంచి ఒత్తిడి పెంచుతున్నది. మరోవైపు కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడడంతో ఆ పార్టీ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై దృష్టిపెట్టింది. వివిధ వ్యాపారాల్లో నిమగ్నమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పార్టీ మారక తప్పని పరిస్థితి నెలకొన్నది.

ఎమ్మెల్యే మైనింగ్‌పై విచారణ

పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్, బీజేపీలు టార్గెట్ చేశాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే సోదరుల మైనింగ్, ఇసుక దందాలపై విచారణ జరిగింది. మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడ్డారంటూ మైనింగ్ శాఖ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డిని అరెస్టుచేసిన విషయం తెలిసిందే. ఇక పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఈడీ షాక్ ఇచ్చింది. మైనింగ్ దందాలో సుమారు రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ మహిపాల్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో సోదాలు నిర్వహించింది. ఇలా పోటాపోటీగా దాడులు, సోదాలు, అరెస్టులు జరగడంతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆలోచనలో పడ్డట్టు ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

వివరణ ఇచ్చినా..

ఈడీ సోదాల అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ మారాలని ఒత్తిడి చేయడం కోసమే బీజేపీ, కాంగ్రెస్‌లు తనపై దర్యాప్తు పేరిట వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తనకు పార్టీ మారే ఆలోచన లేదని వివరించారు. అయినా, దాడులు జరిగినప్పటి నుంచి ఆయన రాజకీయాల్లో, బీఆర్ఎస్ కార్యక్రమాలలో హుషారుగా పాల్గొనడం లేదు. రైతులకు మద్దతుగా ఇటీవల బీఆర్ఎస్ నియోజక కేంద్రాల్లో నిర్వహించిన ఆందోళనలో మహిపాల్‌రెడ్డి పాల్గొనలేదు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కొద్దిరోజుల్లోనే తన రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటారని ఆయన సన్నిహితులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరడమే సరైన నిర్ణయమని ఆయన అనుచరులు ఎమ్మెల్యేను కోరుతున్నట్టు తెలిసింది. అయితే, మహిపాల్‌రెడ్డి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొన్నది.

కేపీఆర్ దారి ఎటో?

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కూడా జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఆయన వ్యాపార వివరాలు ఇప్పటికే ప్రభుత్వవర్గాల వద్ద ఉన్నట్టు సమాచారం ఉంది. మరోవైపు ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో సన్నిహిత సంబంధాలుండటం కలిసొచ్చే అంశం. అందుకే రాష్ట్రంలో వేగంగా మారుతున్న పరిణామాలను బట్టి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా రాజకీయ నిర్ణయం తీసుకొనే అవకాశాలు లేకపోలేదని బీఆర్ఎస్‌లోని ఆయన అనుచరవర్గాలు భావిస్తున్నాయి.

అందరి కన్నా ముందే...

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికన్నా ముందే ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అభినందించడం అప్పట్లో రాష్ట్రస్థాయిలో పెద్ద దుమారమే చెలరేగింది. అలా ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలలో జి.మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వి.సునీతారెడ్డి, కె.మాణిక్‌రావులు ఉన్నారు. అప్పటి నుంచే వీరు ఎప్పుడైనా కాంగ్రెస్‌లో చేరుతారేమోనన్న ఆందోళనలో బీఆర్ఎస్ నాయకత్వం ఉన్నది. నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు జరగాలన్నా, వాటికి నిధుల మంజూరు కావాలన్నా ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉండటం ఎమ్మెల్యేలకు అవసరం. ఆ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొనే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఒకవేళ కాంగ్రెస్‌లో చేరకపోతే విచారణల పేరిట ప్రభుత్వం వేధించే అవకాశాలు లేకపోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనుచరులు అనుమానిస్తున్నారు. మరోవైపు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డవారిపై ఈడీ దృష్టిసారిస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలవరం కలిగిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొని రాజకీయాలలో కొనసాగాలంటే కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలలో చేరడం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నదని ఆయా ఎమ్మెల్యేల అనుచరులు అభిప్రాయపడుతున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు (ఫైల్)

తల్లి పాల నిల్వ కేంద్రం పరిశీలన

ఏడాదైనా ప్రారంభించకపోవడంపై మంత్రి, కలెక్టర్ ఆరా

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశం !

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, జూన్ 24 : సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల నిల్వ కేంద్రాన్ని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. 'తల్లిపాల నిల్వ కేంద్రం ప్రారంభానికి గ్రహణం' శీర్షికన ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు ఆ కేంద్రాన్ని పరిశీలించారు. వైద్య పరికరాలు చేరుకున్న నేపథ్యంలో త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఇంకా పూర్తికాని చిన్నాచితక పనులుంటే పూర్తి చేయాలని టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఏడాదిగా తల్లిపాల నిల్వ కేంద్రం ప్రారంభించకపోవడంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆరా తీశారు. వారి ఆదేశాల మేరకు అధికారులు పరిశీలించి త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించినట్టు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ డీఈఈ విల్సన్, ఏఈ శివ, సిబ్బంది తదితరులు ఉన్నారు.



తల్లిపాల నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బెల్టుషాపులకు
బహిరంగ వేలం

- పల్లెలో యమ డిమాండ్
- పెద్దల సమక్షంలో వేలం పాటలు
- హవేళీఘనపూర్ మండలంలో రూ.లక్షన్నర పలికిన వైనం

మెదక్, జూన్ 24 : మెదక్ జిల్లాలో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. మారుమూల ప్రాంతానికి వెళ్లినా 24 గంటల పాటు మద్యం లభిస్తుంది అంటే ఏ స్థాయిలో బెల్టుషాపులు కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎక్సైజ్ అధికారులు వైన్స్ నిర్వాహకులపై స్టాక్ లిఫ్ట్ చేయాలని ఒత్తిడి తేవడం, లైసెన్స్ ఫీజులు అధికంగా చెల్లించాల్సి ఉండడంతో వైన్స్‌షాపుల నిర్వాహకులు అమ్మకాల కోసం బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారు. అయితే, గ్రామాల్లో మద్యం అమ్మకాలకు డిమాండ్ పెరగడంతో బెల్ట్‌షాపుల నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా..

గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణకు బహిరంగ వేలం పాడుతుండడం సాధారణమైంది. జిల్లాలోని మెదక్, హవేళీఘనపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులకు గ్రామ పెద్దలు వేలం పాటలను నిర్వహిస్తున్నారు. గ్రామంలో సమష్టిగా నిర్వహించే జాతరలు, పండుగలకూ వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఖర్చు చేస్తారు. అందుకే, నిబంధనలకు విరుద్ధమైనా బెల్ట్‌షాపుల బహిరంగ వేలం కొనసాగుతుంది. ఇటీవల హవేళీఘనపూర్ మండల పరిధిలో ఓ బెల్ట్‌షాపునకు వేలం నిర్వహించగా రూ.లక్షా యాభై వేలకు ఓ వ్యాపారి దక్కించుకున్నారు. చాలా గ్రామాల్లోనూ త్వరలోనే బెల్ట్‌షాపుల వేలానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం.



బెల్ట్‌షాపుల వేలాన్ని అడ్డుకుంటున్నాం

జిల్లాలో అనుమతి లేని బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకుంటాం. బెల్ట్‌షాపులకు వేలం పాటలు జరుపుతుండడాన్ని అరికడుతున్నాం. ఈ మధ్యనే అల్లాదుర్గంలో బహిరంగ వేలం నిర్వహించడాన్ని అడ్డుకున్నాం. సిబ్బంది తక్కువగా ఉండడంతో గ్రామాలపై పూర్తి పట్టు సాధించలేకపోతున్నాం. అయినప్పటికీ ఇటీవల ఎన్నికల సందర్భంగా మద్యం అక్రమ నిల్వలను పట్టుకోగలిగాం. అదే స్ఫూర్తితో బెల్ట్‌షాపుల వేలాన్ని నిలువరిస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్

ప్రజావాణికి బారులు

సమస్యలు పరిష్కరించాలని అర్జీలు

సంగారెడ్డి రూరల్, జూన్ 24 : ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలిరావడంతో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ రద్దీగా మారింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బాధితులు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ సమస్య పరిష్కరించేందుకు ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినా పట్టించుకోని తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని మంజీర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ అర్జీలో ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన వినోద, పద్మ, రుక్కమ్మ, మురళిలు తాము 2009లో రాజీవ్ గృహకల్ప కోసం డబ్బులు కట్టామని, ఇంతవరకు ఇండ్లు మంజూరు చేయలేదని, తమకు ఇళ్లను కేటాయించాలని విన్నవించుకున్నారు. కొండాపూర్ మండలానికి చెందిన బుచ్చమ్మ తన భర్త చనిపోయినందున పౌతి మార్పులు చేయాలని అర్జీలో పెట్టుకున్నారు. టేక్మాల్ మండలానికి చెందిన దేవయ్య తనకు సంబంధించిన భూమిలో గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్నప్పటికీ ధరణిలో నమోదు చేయలేదని, కొత్త పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని అర్జీలో కోరారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని, పింఛన్ ఇప్పించాలని, ఉపాధి చూపాలని ఫిర్యాదులు వచ్చాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, కలక్టరేట్ ఏవో పరమేశం, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

మెదక్‌లో 206 అర్జీలు

మెదక్ అర్బన్, జూన్ 24: ప్రజావాణికి దరఖాస్తులు పోటెత్తాయి. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా 206 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ప్రధానంగా ధరణి భూసమస్యలు 40, ఉద్యోగం, ఉపాధి 16, పెన్షన్ల 20, ఇతర సమస్యలకు సంబంధించిన 70 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే సమస్యపై పలుమార్లు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. శాఖల వారీగా పెండింగ్ ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, ఏవో యూనస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఎస్పీ బాలస్వామి దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.



మెదక్‌లో అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు



ప్రజావాణి కోసం తరలివచ్చిన అర్జీదారులు

ఆందోళన వద్దు.. న్యాయం చేస్తాం

- పెద్దగొట్టిముక్ల భూనిర్వాసితులకు నర్సాపూర్ ఆర్డీవో హామీ

నర్సాపూర్, జూన్ 24 : సంగారెడ్డి కెనాల్ కోసం సేకరించే భూమికి నిబంధనల ప్రకారం పరిహారం అందించి న్యాయం చేస్తామని, ఆందోళన చెందొద్దు అని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నర్సాపూర్ రైతువేదికలో శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామం భూనిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి పలుకుతున్నదని, ప్రభుత్వం ఇచ్చేది చాలా తక్కువ అని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరగా పలువురు రైతులు అభ్యంతరాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట తహసీల్దార్ శ్రీనివాస్‌చారితో పాటు పలువురు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

- కాలనీ స్థలాన్ని కాపాడాలి
- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట

కొండెంగలకుంట బీసీ కాలనీవాసుల ధర్నా



చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కొండెంగలకుంట బీసీ కాలనీ వాసులు

చిన్నకోడూరు, జూన్ 24 : తమ కాలనీకి చెందిన 20 గుంటల భూమిని ఓ వ్యక్తి పేరు మీద మార్చేందుకు యత్నిస్తున్న తహసీల్దార్ జయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని సోమవారం చిన్నకోడూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మైలారం అనుబంధ గ్రామమైన కొండెంగలకుంట బీసీ కాలనీవాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండెంగలకుంట గ్రామానికి చెందిన పుట్ట నర్సయ్య వద్ద 2 ఎకరాల 8 గుంటల భూమిని 17 ఏళ్ల క్రితం బీసీ కాలనీకి చెందిన పలువురు కొనుగోలు చేయగా, కొద్ది రోజుల తర్వాత రికార్డుల్లో బీసీ కాలనీ పేరు మీద నమోదైందన్నారు. ఆ భూమి నుంచి 20 గుంటల భూమిని కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన గాజుల కిష్టయ్య పేరున మార్చేందుకు ఆరు నెలల కిందట తహసీల్దార్ జయలక్ష్మీ కలెక్టర్‌కు నివేదించిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఆన్‌లైన్ రికార్డులో 2.08 ఎకరాల భూమికి బదులు 1.28 ఎకరాల భూమి మాత్రమే చూపిస్తుందన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను నిలదీయగా కలెక్టర్‌కు ఎలాంటి ప్రపోజల్ పంపలేదని, ఆ భూమి బీసీ కాలనీ పేరు మీద మార్చుతానని హామీ ఇచ్చిందన్నారు. పలుమార్లు తహసీల్దార్‌ను అడిగినప్పటికీ మార్చకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి కాలనీవాసులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించినా విచారణ చేపట్టలేదన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని వారిని సముదాయించడంతో ధర్నా విరమించారు. తప్పుడు రిపోర్టులు ఇవ్వడంతో పాటు భూమిని వేరొకరి పేరిట ఎక్కించేందుకు యత్నించిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

జీవో 17ను రద్దు చేయాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ అధ్యక్షుడు నర్సింలు

జహీరాబాద్, జూన్ 24 : ఆసరా పింఛన్లకు ఆదాయ పరిమితి విధించే జీవో17ను తక్షణమే రద్దు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నర్సింలు పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టి, ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆసరా పింఛన్ల మంజూరుకు ఆటంకం కలిగించే విధంగా జీవో17ను విడుదల చేసిందన్నారు. దీంతో దివ్యాంగులకు నష్టం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జీవోను రద్దుచేయాలని ఆయన కోరారు. ఆసరా పెన్షన్ల కోసం చాలా మంది దివ్యాంగులు దరఖాస్తులు చేసుకున్నారని, వారందరికీ వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రతీ నెల మొదటివారంలోనే దివ్యాంగులకు పింఛన్ అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు రాజ్‌కుమార్, రాజు, వాజీద్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటా, పాట.. అంగన్‌వాడీ బాట


పెద్దచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు కథలు చెబుతున్న అంగన్‌వాడీ టీచర్ రేణుక

- ఆకట్టుకునే అంశాలతో విద్యాబోధన
- కేంద్రాలకు ఆదరణ
- ఏటా పెరుగుతున్న చిన్నారులు

మునిపల్లి, జూన్ 24: బుడిబుడి అడుగులు వేసే చిన్నారులు ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ.. అక్షరాలు నేర్చుకునేందుకు అంగన్‌వాడీ బాట పడుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా బోధిస్తూ అంగన్‌వాడీ టీచర్లు వారెవ్వా.. అనిపించుకుంటున్నారు. వివిధ ఆట వస్తువులు, చార్టులను తయారు చేసి చిన్నారులకు శ్రద్ధతో విద్యనందిస్తున్నారు. మూడేళ్ల వయస్సు నుంచే చిన్నారులను మురిపిస్తూ.. నూతన విద్యకు శ్రీకారం చుడుతూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల వ్యాప్తంగా మొత్తం 49 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 6 అద్దె భవనాలు, 11 సొంత భవనాలు, 32 ప్రభుత్వ శాఖకు అనుసంధానంగా కొనసాగుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ తెలిపారు. 2022లో 620 మంది పిల్లలు, 2023లో 660 మంది పిల్లలు ఉండగా.. ప్రస్తుతం 755 పిల్లల అంగన్‌వాడీ సెంటర్లలో సంఖ్య పెరిగింది. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించడం, తల్లిదండ్రులు సహకరించడంతోనే విజయవంతమవుతున్నామని శైలజ చెప్పారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన

గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం ఎలా తీసుకోవాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి చెబుతున్నారు. పోషక విలువ లున్న పౌష్టికాహారాన్ని అందిస్తూ తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కాగా చిన్నారులకు ఎంత చెప్పినా వారు చెప్పిందే వేదం అన్న మాదిరిగా వ్యవహరిస్తుంటారు. కానీ వారికి అర్థమయ్యే రీతిలో ఆటలు, పాటలు, కథలు చెబుతూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.



చిన్నచెల్మెడ అంగన్‌వాడీ సెంటర్

విద్యాబుద్ధులు నేర్పిస్తూ..



ఆట, పాటలు, కథలతో పాటు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం. ఇటు పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ.. అటు అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించేలా అవగాహన కల్పిస్తున్నాం. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

- మీనాక్షి, అంగన్‌వాడీ టీచర్, చిన్నచెల్మెడ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలి. వాటిలో చిరుధాన్యాలతో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. రోజువారీగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

- రేణుక, అంగన్‌వాడీ టీచర్, పెద్దచెల్మెడ

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, జూన్ 24: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. గజ్వేల్ పట్టణంలోని సంగుపల్లికి చెందిన కిచ్చుగారి రమేశ్(27) ఆర్థిక ఇబ్బందులు తాళలేక లేక శుక్రవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్‌చేయగా.. వ్యవసాయ పొలం వద్ద ఉన్నానన్నాడు. మాటలో తేడా రావడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పొలం వద్దకెళ్లి చూసేసరికి రమేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు రమేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా మృతుడి కుటుంబాన్ని మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కౌన్సిలర్లు కూరాకుల శ్రీనివాస్, బబ్బూరి రజితలు పరామర్శించారు. వారితో నాయకులు బీరయ్య, మల్లేశం, పోచయ్య, నర్సింహులు, వార్డుసభ్యులు ఉన్నారు.

కారు ఢీకొని పాదచారి మృతి


పెంట్యానాయక్ (ఫైల్)

కౌడిపల్లి, జూన్ 24: పీఎం కిసాన్ డబ్బులు డ్రా చేసేందుకు వచ్చిన రైతును రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మసాగర్ గేట్‌కు చెందిన లంబాడి పెంట్యానాయక్(48) అనే రైతు పీఎం కిసాన్ డబ్బుల కోసం వస్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి నర్సాపూర్ వైపు రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. పెంట్యానాయక్ తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తూప్రాన్ వద్ద రాజస్థాన్‌వాసి ఆత్మహత్య

తూప్రాన్, జూన్ 24: తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ వద్ద రాజస్థాన్ వాసి సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కాలురామ్(40) హైదరాబాద్‌లో నివాసముంటూ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం తూప్రాన్ పట్టణ శివారులోని కరీంగూడ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన కొందరు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు.

భూ వివాదంలో వ్యక్తిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌రెడ్డి

శివ్వంపేట, జూన్ 24: భూ వివాదంలో వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో సర్వేనెంబర్ 70 సెకండ్ సీరియల్‌లో మధుసూదన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మామిడి నర్సారెడ్డి మధ్య కొంతకాలంగా భూవివాదం నెలకొన్నది. ఇటీవల కడీలు ధ్వంసం చేసిన ఘటనలో మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మామిడి నర్సారెడ్డి, అతని తమ్ముడు సత్తిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి పొలం దగ్గర మధుసూదన్‌రెడ్డిని మామిడి నర్సారెడ్డి బూతులు తిడుతుండగా.. మా బావను ఎందుకు తిడుతున్నావని గడ్డం శ్రీనివాస్‌రెడ్డి అడిగాడు. దీంతో సత్తిరెడ్డి, కర్రోళ్ల యాదగిరిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని పట్టుకోగా.. నర్సారెడ్డి కత్తితో పొత్తి కడుపులో పొడవడంతో శ్రీనివాస్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

యాంటీ డ్రగ్ స్క్వాడ్ అధికారులమని.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల కుచ్చుటోపీ

- రూ.13.50 లక్షలు కాజేసిన వైనం
- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో బాధితుడి ఫిర్యాదు

చేర్యాల, జూన్ 24 : సైబర్ నేరగాళ్లు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బురిడీ కొట్టించి రూ.13.50 లక్షలను కాజేసిన ఘటన చేర్యాల మండలంలో సోమవారం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్త్యాల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ రాగా.. తాము ముంబయి ఇంటెలిజెన్స్, నార్కోటిక్ యాంటీ డ్రగ్ స్క్వాడ్ అధికారులమని.. డ్రగ్స్, కొకైన్ పార్శిల్ కొరియర్ ద్వారా ఐర్లాండ్‌కు పంపిస్తున్న క్రమంలో తమకు పట్టుబడినందున విచారణ చేస్తున్నామని చెప్పారు. వారు అడిగిన సమాచారాన్ని అందించాడు. తాము చెప్పినట్లు చేస్తే కేసునుంచి ఉపశమనం పొందుతావని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. కాసేపటికి అనుమానం కలిగి తన బ్యాంకు ఖాతాలను పరిశీలించే సరికి రూ.13.50 లక్షలు ఖాళీ అవడంతో కంగుతిన్నాడు. దీంతో 1930కి కాల్ చేయడంతో సుమారు రూ.3 లక్షలు ఫ్రీజ్ అయ్యాయి. ఈ విషయమై సోమవారం సిద్దిపేట సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

సంగారెడ్డి క్రైం, జూన్ 24: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి మూడురోజుల శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ షకీల్ అహ్మద్ సిద్దిఖీ సోమవారం తీర్పు చెప్పారు. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా పోతిరెడ్డిపల్లికి చెందిన మొహినోద్దీన్ మద్యం తాగి ఆటో నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. ఆ వ్యక్తిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

28న మల్లన్న ఆలయ టెండర్ల నిర్వహణ

చేర్యాల, జూన్ 24: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించ తలపెట్టిన సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలను ఈనెల 28న చేపట్టనున్నట్లు ఈవో బాలాజీశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లన్న, ఎల్లమ్మ ఆలయాల ఆవరణలో కొబ్బరికాయల విక్రయం, భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన వస్త్రాలు, పసుపు, తలనీలాలు సేకరణ, కూరగాయలు, పాలు, పెరుగు, పూల సరఫరాతో పాటు ఇతరత్రా అంశాలలో వేలంపాటలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా విభాగాలకు సంబంధించి 70కిపైగా దరఖాస్తులు వచ్చాయని, ఈనెల 26న షెడ్యూల్స్ దాఖలు చేసిన అనంతరం 28న వేలంపాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఐఐటీహెచ్‌లో నూతన విద్యావిధానంపై జాతీయ సదస్సు


ఐఐటీహెచ్ డైరెక్టర్ బీ.ఎస్.మూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న సహార ఆర్గనైజేషన్ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 24: కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో నూతన విద్యా విధానంపై సోమవారం జాతీయ సదస్సు నిర్వహించారు. రెండురోజుల పాటు ఈ సదస్సు కొనసాగనున్నది. తొలిరోజు నూతన విద్యా విధానంపై సదస్సును ఐఐటీహెచ్ డైరెక్టర్ బీ.ఎస్.మూర్తి, సహార ఆర్గనైజేషన్ డైరెక్టర్ మఠం శంకర్ కలిసి ప్రారంభించారు. అభ్యాసం, విభిన్న సూచనల కోసం యూనివర్సిల్ డిజైన్స్‌పై సదస్సు నిర్వహించారు. సుమారు వందమందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. నూతన విద్యావిధానంలో సహార ఆర్గనైజేషన్ ప్రయత్నాన్ని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీ.ఎస్.మూర్తి అభినందించారు. కాగా సంగారెడ్డిలోని సహారా ఆర్గనైజేషన్ నుంచి దివ్యాంగ చిన్నారులు ఉచితంగా ఆరోగ్య, వైద్య సేవలు పొందవచ్చని ఆ సంస్థ డైరెక్టర్ మఠం శంకర్ తెలిపారు. అనంతరం ఐఐటీహెచ్ డైరెక్టర్ బీ.ఎస్.మూర్తికి సహార ఆర్గనైజేషన్ తరఫున జ్ఞాపికను అందజేశారు.

ప్రశాంతంగా టీజీపీఎస్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు


పరీక్షలకు వెళ్తున్న అభ్యర్థులు

సిద్దిపేట అర్బన్, జూన్ 24: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం టీజీపీఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విపి.రాజు తెలిపారు. వందమంది పరీక్షలు రాయాల్సి ఉండగా 67 మంది హాజరయ్యారు. 33 మంది హాజరుకాలేదని ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, డిప్యూటీ ఎమ్మార్వో కొమురవెల్లి వేణుగోపాలరావు, టీసీఎస్ ఆఫీసర్ సాయిలీల, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ మహ్మద్ షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

కత్తి దాడి కేసులో నిందితుడి అరెస్టు: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, జూన్ 24: గొడవలకు కారణమైన అందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ ఎస్పీ బాలస్వామి తెలిపారు. రెండువర్గాల మధ్య జరిగిన గొడవలో కత్తితో దాడిచేసిన నిందితుడు అబ్దుల్ అతీఖ్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అల్లర్లకు సంబంధించి అన్ని వీడియోలు ఉన్నాయని, వాటి ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. గొడవలపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. కారణమైన ఎవరిని వదిలేదని ఆయన స్పష్టం చేశారు.


సంగారెడ్డి మండలం కల్పగూర్ సమీపంలోని మంజీరా బ్యారేజీని సందర్శించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి


మంజీరా అభయారణ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్

మంజీరా అభయారణ్య కేంద్రానికి అంతర్జాతీయ గుర్తింపు

- సంగారెడ్డి జిల్లాకు అరుదైన గౌరవం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూన్ 24: మంజీరా అభయారణ్య కేంద్రానికి అంతర్జాతీయ గుర్తింపు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ సమీపంలోని మంజీరా బ్యారేజీలో సోమవారం ఆమె సందర్శించి మాట్లాడారు. మంజీరా నుంచి సింగూర్ బ్యారేజీ వరకు మంజీరా రివర్‌లో మొత్తం 20 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉందని, ఈ నీటి ప్రదేశంలో తొమ్మిది ద్వీపాలు ఉన్నాయన్నారు. అక్కడికి పడవ తప్ప ఇతర మార్గాల ద్వారా చేరుకోలేమన్నారు. అభయారణ్యం సరిహద్దు నుంచి వెయ్యి మీటర్ల వరకు ఎకోసెన్సిటివ్ జోన్ నోటిఫై చేశామని తెలిపారు. ఈ అభయారణ్యంలో సుమారు 300 రకాల పక్షులు తమ నివాసాలు కలిగి ఉన్నాయని, వాటిల్లో 112 కంటే ఎక్కువ జాతులు వలస వచ్చాయని తెలిపారు. జంతుజాలం కాకుండా 14 జాతుల ఉభయచరాలు, 57 జాతుల చేపలు, 32 రకాల సీతాకోక చిలుకలు, వివిధ రకాల వన్యప్రాణులు ఈ అయారణ్యంలో నివసిస్తాయని వివరించారు. ఇది రాంసర్ కింద మంజీరా వన్యప్రాణ సంరక్షణ కేంద్రాన్ని సిఫార్స్ చేయడం వల్ల సందర్శకుల తాకిడి పెరిగి, మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంజీరా బ్యారేజీకి అంతర్జాతీయ గుర్తింపు రావడం సంగారెడ్డి జిల్లాకు అరుదైన గౌరవమని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఆమె వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై పుకార్లను నమ్మకండి

- మంత్రి తుమ్మల భరోసా


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతున్న గజ్వేల్ నాయకులు

గజ్వేల్, జూన్ 24: పుకార్లను నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు భరోసానిచ్చారు. తెలంగాణ సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహను టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, టీపీసీసీ సెక్రెటరీ నాయిని యాదగిరి, పార్టీ మండలాధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, గోపాల్‌రావు ఆధ్వర్యంలో అసమ్మతి కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలోని నాలుగు మార్కెట్ కమిటీలు ఇంకా ఎవరికీ ఇవ్వలేదని, పార్టీ సీనియర్ నాయకులందరినీ సంప్రదించిన అనంతరమే మార్కెట్ కమిటీలను ప్రకటిస్తామన్నారు. సోషల్ మీడియా ప్రచారాలను నమ్మవద్దని, పార్టీ కోసం పనిచేసిన వారందరికీ పదవులు ఇస్తామని ప్రకటించారు. వారితో నాయకులు భానుప్రకాశ్, కొమ్ము విజయ్‌కుమార్, వెంకట్రాంరెడ్డి, కృపానందం, అనిల్‌రెడ్డి ఉన్నారు.


మంత్రి దామోదర్‌తో నాయకులు

చాప్టా.కె లో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్, జూన్ 24: ఖేడ్ మండలం చాప్టా.కె హనుమాన్ ఆలయంలో సోమవారం నవగ్రహ దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక మండలి సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ పాల్గొని నవగ్రహాల దేవతామూర్తులకు జలాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, ప్రశాంత్, దత్తురెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయ స్థల వివాదం ఘటనలో కేసు

వెల్దుర్తి, జూన్ 24: మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ఆలయ స్థలం విషయంలో ఇరువర్గాలు గొడవపడ్డ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నవతాగౌడ్ సోమవారం తెలిపారు. ఆరెగూడెం గ్రామానికి చెందిన కొడె మాధవి ప్రతాప్‌రెడ్డి వద్ద స్థలాన్ని కొనుగోలు చేసింది. అదే గ్రామానికి చెందిన గోవిందరెడ్డి మాధవి కొనుగోలు చేసిన స్థలంలో కొంతభాగం తనదంటూ ఇబ్బందులకు గురిచేశాడు. ఆదివారం ఈ విషయమై గోవిందరెడ్డి వెల్దుర్తి, ఆరెగూడెం గ్రామానికి చెందిన పలువురుతో కలిసి దాడి చేశారని మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవతాగౌడ్ తెలిపారు.

ఉద్యోగుల గలాటపై దేవాదాయశాఖ కమిషనర్ ఆరా

- విచారణకు ఆదేశం
- ముగ్గురికి మెమోలు జారీచేసిన ఈవో బాలాజీశర్మ
- ఏఈవో, ప్లంబర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలక్ట్రికల్ విభాగం ఏఈ
- ఇరువురిపై కేసు నమోదు

చేర్యాల, జూన్ 24: విధుల నిర్వహణలో ఒకరు చేసిన తప్పులను మరొకరు ఎత్తిచూపుకుంటూ కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఉద్యోగులు తగువులాడుకున్న విషయమై దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉదోగ్యుల నిర్వాహకంపై ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ద్వితీయశ్రేణి అధికారి, ఉద్యోగులు బాహాబాహీకి దిగిన విషయం తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించి ఈవో బాలాజీశర్మ సోమవారం ఏఈవో శ్రీనివాస్, ఎలక్ట్రికల్ విభాగం ఏఈ బి.అంజయ్య, ప్లంబర్ సార్ల విజయ్‌కు మార్‌లను సంజాయిషీ ఇవ్వాలని మెమోలు జారీ చేశారు.

ఏఈవో, ప్లంబర్‌లపై కేసు

తాను మల్లన్న ఆలయ అంతర్గత విషయాలను లీక్ చేస్తున్నాన్న కారణంగా ఏఈవో గంగా శ్రీనివాస్, ప్లంబర్ విజయ్ చెంపలపై కొట్టడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించారని, వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ ఎలక్ట్రీషియన్ బి.అంజయ్య సోమవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఏఈవో, ప్లంబర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. ఇదిలా ఉండగా సీసీ కెమెరాలు లేని ఈవో కార్యాలయ గదిలో జరిగిన ఈ గొడవకు సంబంధించి ఆధారాలు లేని నేపథ్యంలో ఉద్యోగులు ఎలాంటి సంజాయిషీ ఇస్తారని, పోలీసుల విచారణలో ఎలాంటి పరిమాణాలు చోటుచేసుకుంటాయో ఆసక్తికరంగా మారింది.

దొంగ సంతకాలే గొడవకు కారణమా?

మల్లన్న ఆలయంలో ద్వితీయశ్రేణి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎవరికి ఇష్టం వచ్చిన వేళల్లో వారు విధులకు హాజరవుతున్నారు. ఇటీవల పలువురు విధులకు హాజరుకాకున్నా రిజిష్టర్‌లో సంతకాలు చేసిన విషయాన్ని ఎలక్ట్రీషియన్ అంజయ్య సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసిన విషయంతో పాటు బిల్లులు నిలిపివేత కారణంగా ఏఈవో శ్రీనివాస్, ప్లంబర్ సార్ల విజయ్, ఎలక్ట్రీషియన్ ఏఈ అంజయ్య మధ్య వాగ్వాదం పెరిగి చెంపచెల్లుమనిపించుకోవడం వివాదాస్పదమైంది. కాగా పై ముగ్గురిపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఏఈవో శ్రీనివాస్ బాసర సరస్వతీ ఆలయంలో అవినీతికి పాల్పడి సస్పెన్షన్‌కు గురవడంతో పాటు మల్లన్న ఆలయంలో సక్రమంగా అందుబాటులో ఉండడన్న ఆరోపణలు ఉన్నాయి. ఏఈ అంజయ్య నకిలీ వయస్సు, విద్యార్హతతో ఉద్యోగం పొందాడని, ప్లంబర్ విజయ్ నీటి సరఫరా, విధులు సక్రమంగా నిర్వర్తించడన్న ఆరోపణలు ఉన్నాయి.

సంగారెడ్డి-జోగిపేట రైల్వే లైన్‌పై కదలిక

- మెదక్ ఎంపీ, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జీఎం హామీ
- రైల్వే సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్‌గుప్తా

జోగిపేట, జూన్ 24: గతంలో ప్రతిపాదించిన వట్టి నాగులపల్లి-సంగారెడ్డి- జోగిపేట-మెదక్ రైల్వే లైన్‌తోపాటు, వట్టి నాగులపల్లి-సంగారెడ్డి- జోగిపేట మీదుగా ఆదిలాబాద్‌కు రైల్వే లైన్లను ఏర్పాటులో కదలిక ప్రారంభమైందని రైల్వే సాధన సమితి కన్వీనర్, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్‌గుప్తా అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ రైల్వే లైన్లను ఏర్పాటు చేయాలంటూ సోమవారం ఉదయం తాను బీజేపీ సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, అనంతరావు కులకర్ణిలతో కలిసి దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ.శ్రీధర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావును వేర్వేరుగా కలిశామన్నారు. వట్టి నాగులపల్లి-పటాన్‌చెరు-సంగారెడ్డి- జోగిపేటల మీదుగా మెదక్‌కు ఒక రైల్వే లైన్‌ను, వట్టి నాగులపల్లి- పటాన్‌చెరు-సంగారెడ్డి-జోగిపేట-నారాయణఖేడ్‌ల మీదుగా ఆదిలాబాద్ వరకు మరో రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలంటూ... 15 ఏళ్లుగా తాను ప్రతీ ఎంపీ, కేంద్ర, రాష్ట్ర మంత్రుల ద్వారా, స్వయంగా ఢిల్లీలోని రైల్వే బోర్డు కార్యాలయాలకు తిరుగుతూ, రైల్వే మంత్రులు, అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులను సమర్పించానని ఎంపీ, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జీఎంలకు వివరించానన్నారు. వారందరి సహకారంతో వట్టి నాగులపల్లి- సంగారెడ్డి-జోగిపేట-మెదక్ రైల్వే లైన్ కోసం సర్వే పనులకు నిధులు మంజూరై, మొదటి దఫా సర్వే పూర్తయిందని వివరించానని తెలిపారు. ఈ నేపథ్యంలో మరింత కృషిచేస్తే ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే లైన్ కల సాకారమౌతుందని వారిని కోరానని పేర్కొన్నారు. దీంతో వారిద్దరూ సానుకూలంగా స్పందించారని చెప్పారు. మూడునెలల్లో ఈ రెండు రైల్వే లైన్ల కోసం చివరి సర్వేను పూర్తి చేయిస్తామని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ.శ్రీధర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హామీనిచ్చారన్నారు.


దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జీఎం ఏ.శ్రీధర్‌కు రైల్వేలైన్ జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం


మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు రైల్వే లైన్ గురించి వివరిస్తున్న జోగినాథ్‌గుప్తా



సంగారెడ్డిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి, వైద్య సిబ్బంది

పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన ఉండాలి

● జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్

సంగారెడ్డి అర్బన్, జూన్ 24 : పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి సూచించారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావ్-బేటీ పడావ్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డిలోని ఇంద్రనగర్ యూపీహెచ్‌సీలో ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీనెటల్ డయాగ్నోస్టిక్స్ టెక్నిక్స్(పీసీపీఎన్‌డీటీ)చట్టంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టం ఆడపిల్లల భ్రూణహత్యలు ఆపడానికి, క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం చట్టానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.ప్రేమఅమృత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ల్యాబ్‌లపై చర్యలు

జహీరాబాద్, జూన్ 24: ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లను కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో శంకర్ హెచ్చరించారు. వారం రోజులుగ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జహీరాబాద్ పట్టణంలో సుమారు 20 ప్రైవేటు ఆస్పత్రులు, వివిధరకాల పరీక్షలు చేసే 20ల్యాబ్‌లను తనఖీలు చేశామని తెలిపారు. అందులో భాగంగా సోమవారం పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఓ ప్రైవేటు ల్యాబ్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా రక్తపరీక్షలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వెంట వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశయం ఘనం.. ఆచరణలో శూన్యం

- హత్నూర మండలంలో మొత్తం 38 డంపుయార్డులు
- నిర్వహణ లేక అలంకారప్రాయం
- సరిపడా కార్మికులు లేక కుంటుపడిన తడి, పొడి చెత్త సేకరణ
- నిధుల లేమితో చేతులెత్తేసిన గ్రామ పంచాయతీలు





గుండ్లమాచునూర్‌లో వినియోగంలోని లేని డంపుయార్డు, మంగాపూర్ శివారులో కుంటలో పారేసిన చెత్త

హత్నూర, జూన్ 24: గ్రామాల్లో చెత్తను సేకరించి దానితో వర్మి కంపోస్టు ఎరువును తయారు చేసి తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని రాష్ట్రప్రభుత్వం ఆశయం. అందులో భాగంగానే రూ. లక్షలు వెచ్చించి అన్ని గ్రామ పంచాయతీల్లో డంపుయార్డుల నిర్మాణం చేశారు. పని భారం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా డంపుయార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

అలంకారప్రాయంగా..

హత్నూర మండలంలో 38 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అప్పటి సర్పంచులపై అధికారులు ఒత్తిడి చేసి నిర్మాణాలు పూర్తి చేయించారు. అయితే పని భారం, ఆర్థిక ఇబ్బందులతో డంపుయార్డుల నిర్వహణ కుంటుపడింది. అప్పట్లో నిధుల లేమి కారణంగా కొందరు సర్పంచులు పనులు ప్రారంభించేందుకు ససేమిరా అన్నప్పటికీ అధికారులు ఎట్టిపరిస్థితుల్లోనైనా పనులు పూర్తిచేయాల్సిందేనని ఒత్తిడి తెచ్చారు. దీంతో కొందరు సర్పంచులు అప్పులు చేసి డంపుయార్డుల నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే గ్రామాల్లోని ఇళ్లలో సేకరించిన తడి, పొడి చెత్తను యార్డుల్లో వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసి విక్రయిస్తే ఆయా గ్రామ పంచాయతీలకు కొంత ఆర్థిక లాభం చేకూర్చినట్లు అవుతుందని అప్పట్లో ప్రభుత్వం ఆశించింది. అయితే కొద్ది రోజులు ఈ విధానాన్ని అవలంబించినప్పటికీ ఈ ప్రక్రియకు సరిపోయేలా కార్మికులు లేకపోవడంతో గ్రామ పంచాయతీలు చేతులెత్తేశాయి. అంతే కాకుండా సేకరించిన చెత్తను పాడుబడ్డ బావుల్లో పారవేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా డంపుయార్డులు అలంకారప్రాయమయ్యాయి.

నిధుల లేమితో భారమైన నిర్వహణ

గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది కావస్తున్నా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామ పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శుల తీవ్ర ప్రభావం చూపుతున్నది. గ్రామ పంచాయతీలో వినియోగించే ట్రాక్టర్లకు నిర్ణీత సమయంలో ఈఎంఐలు, కట్టకపోవడంతో పాటు డీజిల్‌కు నిధులు లేక కార్యదర్శులు సతమతమవుతున్నారు. పలు గ్రామపంచాయతీల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త సేకరణ చేస్తుండగా.. మరికొన్ని చోట్ల పూర్తిగా మానేశారు. దీంతో గతంలో మాదిరిగానే ఇళ్ల మధ్యన చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు



మేము కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలో గతంలో బలవంతంగా డంపుయార్డు నిర్మాణం చేశారు. కానీ ఇప్పటి వరకు దాని నిర్వహణే మరిచిపోయారు. జిల్లా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న డంపుయార్డును వినియోగంలోకి తీసుకురావాలి

- డి.అనిల్, గుండ్లమాచునూర్ నివాసి

చెత్త సేకరణ చేయిస్తున్నాం



హత్నూర మండలంలోని అన్ని గ్రామాలలో చెత్త సేకరణ చేస్తున్నాం. ప్రస్తుతం కొన్ని గ్రామ పంచాయతీలలో నిధుల లేమి కారణంగా సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించక కొంత ఇబ్బంది తలెత్తుతుంది. గ్రామ కార్యదర్శులు సొంత డబ్బులు చెల్లిస్తూ ట్రాక్టర్లలో డీజిల్ పోయిస్తూ చెత్త సేకరణ చేయిస్తున్నారు. తడి, పొడి చెత్త అన్ని గ్రామాల్లో కచ్చితంగా సేకరించి డంపుయార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శంకర్, హత్నూర ఎంపీడీవో

తప్పిపోయిన బాలుడు పోలీస్‌స్టేషన్‌లో..



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బాలుడు

సంగారెడ్డి క్రైం, జూన్ 24: తప్పిపోయిన ఓ బాలుడు సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్టు పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఏడేళ్ల వయసు గల అర్బజ్ అనే బాలుడు బస్ ఎక్కి సంగారెడ్డికి వచ్చినట్టు చెప్పారు. తన తండ్రి పేరు ఆరీఫ్ అని, తమది హైదరాబాద్‌లోని మణికొండ అని చెబుతున్నాడని పేర్కొన్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏడుస్తూ కనిపించగా స్థానికులు ఆ బాలుడిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ భాస్కర్ కోరారు.

వరుస దొంగతనాలపై చర్యలు తీసుకోండి

● సంగారెడ్డి ఎస్పీకి గొల్లపల్లి గ్రామస్థుల వినతి

సంగారెడ్డి క్రైం, జూన్ 24: కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రానికి గొల్లపల్లి గ్రామస్థులు తరలివచ్చి ఎస్పీ చెన్నూరి రూపేష్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో గత ఏప్రిల్ 18 నుంచి ఐదు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయన్నారు. తాజాగా జూన్ 4న చాకలి చంద్రయ్య ఇంట్లో 10 తులాల బంగారం, 2 లక్షల నగదు, కిలో వెండి దొంగిలించినట్లు తెలిపారు. బాధితులంతా కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఎస్పీ స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మెదక్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిని తనిఖీ చేసిన జాతీయ వైద్య కమిషన్



వైద్య కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జాతీయ వైద్య కమిషన్ సభ్యులు

మెదక్, అర్బన్, జూన్ 24: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిని జాతీయ వైద్య కమిషన్ బృందం తనిఖీ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలో పిల్లికోటలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల భవనాన్ని కమిషన్ సభ్యులు పరిశీలించి, తనిఖీ చేశారు. కమిషన్ వైద్య అర్హతల గుర్తింపును, వైద్య పాఠశాలలకు అక్రిడేటేషన్, వైద్య అభ్యాసకులకు రిజిస్ట్రేషన్ వైద్య అభ్యాసాన్ని పర్యవేక్షణ, వైద్య మౌలిక సదుపాయాలను పరిశీలించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ప్రణాళిక, చేసుకోవాలని కోరారు. కమిషన్ సభ్యులు డా. దాస్, డా. కుష్నూర్ షేక్, డా. సుష్మా కుషాల్ కటారియా, కలెక్టర్ రాహుల్ రాజ్, ప్రిన్సిపాల్ డా. రవీందర్‌కుమార్, కృష్ణరెడ్డి, డా. చంద్రశేఖర్, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మంగంపేటలో భూ ఆక్రమణలపై ఆర్డీవోకు ఫిర్యాదు

జిన్నారం, జూన్ 23: మంగంపేటలో ఏర్పాటు చేసిన డంపుయార్డు, పల్లె ప్రకృతి వనం, ఆలయ భూమి కబ్జాపై స్థానికులు ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం ఆర్డీవో వసంతకుమారిని మంగంపేటవాసులు కలిసి తమ గ్రామ శివారులోని ఆలయ భూమి సహా డంపుయార్డు, పల్లె ప్రకృతివనం, లింకు రోడ్డును ఓ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలంలో నిర్మించారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డంపుయార్డు, పల్లె ప్రకృతి వనం, లింకు రోడ్డుల కోసం ఖర్చు చేసిన నిధుల వివరాలు, రికార్డులను ఆర్డీవోకు అందజేశారు. సమగ్ర విచారణ చేసి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

ఇంటర్ అడ్వాన్స్ ఫలితాల్లో 'శ్రీ అక్షయ' ప్రభంజనం

సంగారెడ్డి అర్బన్, జూన్ 24: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటర్ ఫలితాల్లో సంగారెడ్డిలోని శ్రీ అక్షయ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను అపర్ణ, శివకుమార్‌లు 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించారు. బీపీసీ విభాగంలో 440 మార్కులకుగాను సుప్రియ గురుంగ్ 437 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం దక్కించుకున్నారు. ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను లక్ష్మీశ్రావ్య 495 మార్కులు, సీఈసీ విభాగంలో ప్రణిక 491 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు భానుచందర్‌రెడ్డి, రాజుగౌడ్, సుధాకర్‌జోషి, అధ్యాపక బృందం అభినందించారు.

ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో సంగారెడ్డిలోని ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకుగాను శ్రావ్య, భార్గవి 466 మార్కులు సాధించారు. బీపీసీ విభాగంలో 440 మార్కులకుగాను శైలజ 437, రుక్మిణి 454 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో 500 మార్కులకుగాను స్నేహకుమారి 449 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రైవేట్ విద్యాలయంలో బుక్స్ స్టోర్ రూం సీజ్

చేగుంట, జూన్ 24: చేగుంటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అనుమతి లేకుండా టెక్స్ట్ బుక్స్ అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు మేరకు సోమవారం చేగుంట నోడల్ అధికారి నీరజ సదరు పాఠశాలలోని స్టోర్ రూంను సీజ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ- దీప్తి విద్యాలయంలో టెక్స్ట్ బుక్స్ అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చేగుంట మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఎంఈవో ఆదేశాల మేరకు సదరు స్కూల్‌ను సందర్శించిన నోడల్ అధికారి టెక్స్ట్ బుక్స్ అమ్ముతున్న స్టోర్ రూంను సీజ్ చేసినట్లు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, నాయకులు ప్రవీణ్ వున్నారు.

లే అవుట్‌కు భూములు ఇచ్చిన రైతులకు పొజిషన్లు చూపాలి

జిన్నారం, జూన్ 23: జిన్నారం సర్వే నెంబరు 1లో హెచ్ఎండీఏ లే అవుట్ కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ లావణ్య, కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్ భిక్షపతిని ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ లావణ్య, కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఏడాది క్రితం హెచ్ఎండీఏ లే అవుట్ కోసం జిన్నారం, జంగంపేటలో రైతుల అసైన్డ్ భూములను గత ప్రభుత్వం సేకరించిందని, ఎకరాకు 600 గజాల చొప్పున రైతులకు స్థలాన్ని ఇచ్చినా నేటికీ పొజిషన్లు చూపలేదని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు వెంటనే న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, ఎంపీపీ ఉపాధ్యక్షుడు గంగు రమేష్, నాయకులు పుట్టి భాస్కర్, నరేందర్‌గౌడ్, రాజుగౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రహస్యంగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

● గత సమావేశంలో ఘర్షణ తలెత్తడమే కారణం

రామాయంపేట, జూన్ 24: రామాయంపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం రహస్యంగా నిర్వహించారు. మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ సమావేశం జరపటం గమనార్హం. అయితే గత సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరుకాగా సభ్యుల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ చెలరేగింది. దీంతో ఈసారి మీడియాకు తెలుపకుండానే సమావేశం ముగిసిన మీదట ఈ విషయాన్ని కమిషనర్ ప్రెస్ గ్రూపుల్లో పెట్టారు. ఈ మేరకు.. 12 మంది కౌన్సిలర్లు హాజరైన సమావేశంలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ దేవేందర్ మాట్లాడుతూ అత్యవసర పనుల కోసం ప్రతీ వార్డుకు రూ.10 లక్షల వంతున నిధులు విడుదల చేయాలని తీర్మానించినట్టు పేర్కొన్నారు. విద్యుత్తు దీపాల మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పనులు చేపట్టనున్నామన్నారు.

కౌడిపల్లిలో తైబజార్ వేలం

కౌడిపల్లి, జూన్ 24: మండల కేంద్రలోని తై బజార్‌ను సోమవారం ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలం పాటను అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. వేలం పాటలో 7 మంది పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మార్చి నెల గడిచి పోవడంతో 9నెలలకు గాను రూ.4,63,000లకు స్థానికుడైన శేక్ షఫీ దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం ఉన్నారు.

● వెల్దుర్తి, జూన్ 24: వెల్దుర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా 10 దుకాణా సముదాయాలు నిర్మించారు. దుకాణాలకు సంబంధించి సోమవారం సొసైటి చైర్మన్ అనంతరెడ్డి అధ్యక్షతన వేలం పాట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేలంపాటలో ఇద్దరు మాత్రమే పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనకపోవడంతో వేలం పాట కార్యక్రమంను వాయిదా వేశారు. జూలై 1న వేలం పాటను తిరిగి నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు విస్తరణలో నష్టపోయినవారికి పరిహారం

మనోహరాబాద్, జూన్ 24 : మండల కేంద్రంలో గతంలో రోడ్డు స్తరణలో నష్టపోయిన వారికి తహసీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిని 2006లో 4 లైన్లుగా ఏర్పాటు చేయడం వల్ల మండలంలోని రామాయపల్లి, మనోహరాబాద్, జీడీపల్లి, ముప్పిరెడ్డిపల్లి, కూచారం, కాళ్లకల్ గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు తమ పొలాలు, భవనాలు కోల్పోయారు. సోమవారం మండలంలో సుమారు 52మందికి చెక్కులను పంపిణీ చేశారు.

విజయశాంతిని కలిసిన నేతలు

రామచంద్రాపురం, జూన్ 24: మెదక్ మాజీ ఎంపీ, ప్రముఖ సినీనటి విజయశాంతి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కాంగ్రెస్ మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ ఖదీర్, సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్‌ఘనీ, ఖయ్యూంలు నగరంలోని ఆమె నివాసంలో పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నర్సింహులుకు జాతీయ అవార్డు

నారాయణఖేడ్, జూన్ 24: ఖేడ్ పరిధిలోని తోర్నాల్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కొటారి నర్సింహులు సామాజిక సేవలను అందించినందుకు గాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు 2024 అందుకున్నారు. సోమవారం హైదరాబాద్ శివార్లలోని చందానగర్‌లోని ప్రపంచ మానవ హక్కుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రొఫెసర్ నవోదయసిద్దు నర్సింహులును సన్మానించి అవార్డును అందజేశారు.

పదోన్నతులు కల్పించాలి

నారాయణఖేడ్, జూన్ 24: ఉపాధ్యాయులకు సంబంధించి పూర్తి స్థాయిలో పదోన్నతులు కల్పించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి డిమాండ్ చేశారు. సోమవారం ఖేడ్‌లో నిర్వహించిన సంఘం డివిజన్‌స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, జిల్లా, డివిజన్ బాధ్యులు మల్లికార్జున్, చంద్రకాంత్, జగదీష్, రతన్, మశ్చందర్, ఓంబసవ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గుమ్మడిదల, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రైతులకు రుణ మాఫీ చేస్తున్నట్లు మంత్రివర్గం ఆమోదించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు సంఘంలో రైతులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, రాష్ట్ర రైతుసంఘం సమైక్య మాజీ అధ్యక్షుడు మంద బలరాం రెడ్డి పలువు రైతులు కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి'



విద్యార్థులకు బోధించే అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి సీడీపీవో సునితాబాయి

జహీరాబాద్, జూన్ 24: నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా సెంటర్లలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ కొత్తపద్ధతుల్లో అర్థమయ్యేవిధంగా విద్యను బోధించాలని జహీరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో సునితాబాయి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రంజోల్ రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లకు ఆయా సెంటర్లలో చేపట్టే వివిధ రకాల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యార్థుల్లో శారీరక, మానసిక మేధోవికాసం, భాష, అక్షరాస్యత అభివృద్ధి, సామాజిక భావోద్వేగ, నైతికాభివృద్ధి, సౌందర్యం, సాంస్కృతిక అభివృద్ధి తదితర అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షకులతో అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఇంకా ఏమైనా ఇబ్బందులుంటే శిక్షకులను సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయా శిక్షణకేంద్రాల్లో మూడురోజుల పాటు అంగన్‌వాడి టీచర్లకు శిక్షణను నిర్వహిస్తున్నామని, అందరూ తప్పనిసరిగా శిక్షణలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్, జూన్ 24: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఆకట్టుకునే విధంగా విద్యాబోధన చేయాలని సీడీపీవో సుజాత సూచించారు. సోమవారం నారాయణఖేడ్, మనూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ప్రీస్కూల్‌శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణలో అజీంప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రతినిధులు బోధనా తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని నిర్వహించాలని నిరుద్యోగుల ధర్నా





మెదక్ జిల్లా గ్రంథాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థుల ధర్నా, ఖేడ్ గ్రంథాలయం వద్ద ప్లకార్డులతో నిరసన

మెదక్ అర్బన్, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని నిర్వహించాలని కోరుతూ మెదక్ జిల్లా గ్రంథాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థులు శాంతియుతంగా ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ద్వారా 25వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు హామీ ఇచ్చిందన్నారు. వెంటనే హామీని అమలు చేయాలని కోరారు. డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు మరో 3 నెలల గడువును పొడిగించాలని కోరారు.

●నారాయణఖేడ్: మెగా డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నారాయణఖేడ్‌శాఖ గ్రంథాలయం ముందు నిరుద్యోగులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ఇంతకుముందే ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఖాళీల ఆధారంగా భర్తీ చేస్తే నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని, అందువల్ల పదోన్నతుల ద్వారా ఖాళీ అయిన ఉపాధ్యాయుల పోస్టులతో విద్యాభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని, అందువల్ల పదోన్నతులతో ఖాళీ కానున్న పోస్టులను సైతం కలిపి ఒకేసారి మెగా డీఎస్సీని నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సదుపాయాల కల్పనకు కృషి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి



కల్హేర్‌లో ఉపాధ్యాయుడి ఉద్యోగవిరమణ సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జూన్ 24: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించి కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రిన్సిపాల్ అసద్ ఫరూఖ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ- ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు లేకుండా మంచి వాతావరణంలో విద్యాబోధన జరిగేలా చూస్తానన్నారు.అంతకుముందు కల్హేర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బాచ శ్రీనివాస్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉపాధ్యాయ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశీనాథ్ యాదవ్, వివిధ సంఘాల ప్రధాన బాధ్యులు, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, శ్రీరాం నాయక్, మురళీగౌడ్, బొడ్ల శ్రీనివాస్, ఎంఈవో శంకర్, కల్హేర్ పీజీ హెచ్ఎం శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్తహీనత లోపాలు లేకుండా చూసుకోవాలి

● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఎస్టీబాలుర వసతిగృహంలోమాట్లాడుతున్న ఎమ్మెల్యే

జహీరాబాద్, జూన్ 24: విద్యార్థుల్లో రక్తహీనత లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్లు, వైద్యసిబ్బందిపై ఉందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పేర్కొన్నారు. రక్తహీనత నివారణ (సికిల్‌సెల్ అనిమియా)దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడంలో నిర్లక్ష్యం చేస్తే రక్తహీనతలోపాల ప్రభావంతో వివిధ రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. వసతిగృహల వార్డెన్లు ఎప్పటి కప్పుడు విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. వైద్యసిబ్బంది కూడా ఎప్పటికప్పుడు వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిపెట్టి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, డా.సోహెల్, వసతిగృహం వార్డెన్లు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి.. హరీశ్‌రావు పరామర్శ



కుటుంబీకులను పరామర్శిస్తున్నహరీశ్‌రావు

నర్సాపూర్, జూన్ 24: అందరితో కలుపుగోలుగా ఉండే జక్కపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చిన్నవయసులోనే మరణించడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జక్కపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సోమవారం ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి గ్రామానికి వెళ్లి శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి భార్య, మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మితో పాటు కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. హరీశ్‌రావు వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శిరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు హబీబ్‌ఖాన్ తదితరులు మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

● తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి అర్బన్, జూన్ 24: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్.రత్నప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాల ప్రవేశాల్లో భాగంగా దోస్త్ మూడవ ఫేజ్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏ కళాశాలలో లేని నూతన కోర్సులు తమ కళాశాలలో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. విద్యార్థులు తమ కళాశాలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి వివిధ కోర్సుల్లో చేరవచ్చన్నారు. జూలై 2వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. బీఎస్సీ(ఫార్మా), బీబీఏ(రిటైలింగ్)వంటి నూతన కోర్సులతో పాటు బీసీఏబీబీఏ(జనరల్), బీకాం(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్‌సైన్స్, బీఏలలో వివిధ రకాలైన అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ కళాశాలలో ఉన్నతమైన విద్యార్హతలు, మంచి అనుభవమున్న అధ్యాపకులతో బోధన చేస్తున్నట్టు వివరించారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యంతో పాటు అవసరమైనవారికి హాస్టల్ సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్.. కేజీబీవీలో విద్యార్థిని చేరిక

కొల్చారం, జూన్ 24: మండలంలోని సంగాయిపేట గ్రామంలో ఎంబరి పుష్పలత గత ఏడాది 7వ తరగతిలో బడి మానేసింది. ఆర్థికస్తోమత సరిగా లేకపోవడంతో ఇతరుల మాటలకు తలొగ్గి అమ్మాయికి పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆదివారం నిర్ణయించారు. ఈ సమాచారమందుకున్న ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, పంచాయతీ కార్యదర్శితో పాటు ఇతరశాఖల సిబ్బంది సోమవారం ఎంబరి పుష్పలత ఇంటికి వెళ్లి బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులు ఒప్పుకోవడంతో కొల్చారంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి నాగరత్నం, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

వసతి గృహంలో దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, జూన్ 24: పట్టణ శివారులో కేజీబీవీ వసతి గృహం పక్కన గల ప్రభుత్వ గిరిజన పోస్ట్ మెట్రిక్ కళాశాల వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ, వొకేషనల్, డిప్లొమా చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కోసం దరఖాస్తులు సమర్పించాలని హెచ్‌డబ్ల్యూవో బాలమణి తెలిపారు. 80సీట్లు ఖాళీ ఉన్నాయని, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం ప్రభుత్వ గిరిజన పోస్ట్ మెట్రిక్ కళాశాల వసతి గృహంలో సంప్రదించాలని సూచించారు.

రూ. 90 లక్షలతో సీసీ రోడ్లు



బస్తీదర్శన్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం, జూన్ 24: జీహెచ్ఎంసీ పరిధిలోని 111 భారతీనగర్, 112 రామచంద్రాపురం డివిజన్లలో సోమవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. 111 డివిజన్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డి రూ.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రామచంద్రాపురం పట్టణంలో సండే మార్కెట్ ఆవరణలో రూ.40 లక్షలతో కార్పొరేటర్ పుష్పానగేష్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

మత్తుపదార్థాలతో అనర్థాలపై అవగాహన

చేగుంట, జూన్ 24: చేగుంటలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల నుంచి పట్టణంలోని బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరి ప్రసాద్ నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా

మెదక్ అర్బన్, జూన్ 24: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై ప్రభుత్వం నిర్లక్ష వైఖరి వెంటనే వీడి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. పంచాయతీ కార్మికుల రాష్ట ఉపాధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. తక్షణమే పెండింగ్ జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీపీవోకు వినతిపత్రం అందజేశారు.

ఇంటర్ ఫలితాల్లో మోడల్ విద్యార్థుల ప్రతిభ

జిన్నారం, జూన్ 23: ఇంటర్ సప్లమెంటరీ ఫలితాల్లో మోడల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం ప్రకటించిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంఈసీ విద్యార్థి సమీర్ 465 (470), బైపీసీ విద్యార్థిని రాజ్‌నందిని 436 (440), ఎంఈసీ విద్యార్థిని ప్రసన్న 474 (500), సీఈసీ విద్యార్థిని షాబా బేగం 477 (500) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బాలకృష్ణ తెలిపారు.